**శ్రీ రమణ జ్యోతి** **Sri Ramana Jyothi**

జనవరి 2020 January 2020

ఈ సంచికలో ... IN THIS ISSUE ...


1. **డా॥ కే.యస్. గారి 66వ ప్రవచనం** — డా॥ వి. రామదాస్ మూర్తి 3
2. **అమరత్వ చేతన** — డా॥ తోట శ్రీనివాస్ 8
3. **శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు** — కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి 16
4. **శ్రీ భగవాన్ సేవలో** — జి. శ్రీహరిరావు 23
5. *Tyaga* alone Bestows Immortality — Dr.K. Subrahmanian 30
6. Write It, Don't Just Read It! — Vimal Balasubrahmanyan 36
7. Annapurna — Manaswini Sridhar 38
8. Lest We Forget - Sri Mahipatram Dave — G.V. Rajeswara Rao 42
7. Kavyakantha's Chatvarimsat — V. Krithivasan 48


***Sri Ramana Jyothi wishes its readers***
***A Very Happy Prosperous New Year 2020***

**Events in Sri Ramana Kendram in January 2020**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 11th January Dr.K.S. Remembrance Day - 6.00 - 7.30 p.m.
4. 11th January (Every 2nd Saturday of the month) Uma Sahasram recitation from 12.00 noon - 5.00 p.m.
5. 12th January - Sri Bhagavan's Jayanthi Day celebrations and Satsang 9.00 - 12.00 noon
5. 12th January - Punarvasu Satsang - 6.00 - 7.30 p.m.

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# భగవాన్ ఎల్లప్పుడూ భగవానే

డా॥ కే.యస్. గారి 66వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

మహర్షి ఎల్లప్పుడూ సత్సంగం యొక్క ప్రాముఖ్యతను గురించి చెబుతుండేవారు. సత్సంగంలో వీలైనంత సేపు ఇతర భక్తులతో గడపాలి. ఆ వాతావరణంలో మనం వర్ణించలేని విధంగా కంపనలు చుట్టుముడుతుంటాయి. మనకు ఆ విషయం తెలియకపోవచ్చు. మనం గ్రహించలేము. ఏమైనప్పటికీ వాటి ప్రభావం కొన్నాళ్ళు మనపై పడుతుంటుంది. జయాపజయాలతో నిమిత్తం లేకుండ మన కార్యక్రమాలను చేయగలుగుతాము. సత్సంగ ప్రభావమే దానికి కారణం. మరొక విషయం. సత్సంగం సమయాలలో తరచు ఎన్నో ఆలోచనలు బయటికి వస్తుంటాయి. దాని విషయమై కలత చెందనవసరం లేదు. నిజానికి, అలా జరగుతున్నందుకు కృతజ్ఞతలను తెలుపుకోవాలి. ఎందుకంటే తద్వారా మన మనసులో నుండి అనవసరమైన విషయాలు ఖాళీ అయిపోతున్నాయన్న మాట. అది మంచిదే. తన ఆధ్యాత్మిక ప్రగతిని మనిషి అంచనా వేయలేడు. ఎందుకంటే అది మనసుకు అతీతమైన విషయం. అలాంటప్పుడు మనసు తనకు మించిన దాని గురించి బేరీజు వేయడం కుదరదు కదా!

## అరుణగిరి ఆకర్షణ అద్భుతం

ఇక స్వయంగా భగవాన్ సమక్షంలో వుండడం అంటే పరిస్థితి ఎలా వుంటుందో ఆలోచించండి. అలాంటి సౌభాగ్యం నాకు

చిన్నప్పుడే కలగడం నా అదృష్టం. గొప్పగా చెప్పుకోవడం కాదు గాని దానికి నా పూర్వజన్మ సుకృతమే కారణం అనాల్సిందే. భగవాన్ స్వయంగా శివుడే అన్న గట్టి భావన ఆ రోజుల్లో ఏర్పడింది. పదహారు, పదిహేడేళ్ళ వయసు ప్రాంతంలో తిరువణ్ణామలై రైలు స్టేషన్ నుండి ఆశ్రమానికి నడిచి వెళ్ళేవాడిని. అసలు రైలులో లేదా బస్సులోగాని తిరువణ్ణామలై వస్తుంటే, అల్లంత దూరం నుండి అరుణాచలం కనిపిస్తూ వుండడంతోనే, చెప్పలేని ఉత్సాహం, గగుర్పాటు పెనవేసుకుంటాయి. మొదటిసారి గిరి దర్శనం చేసినప్పటి అనుభూతి ఎలా వుంటుందో చెప్పాల్సిన అవసరం లేదు. ఒక యూరోపియన్ సందర్శకురాలు అరుణాచలం గురించి చెబుతూ, తాను ఎన్నో దేశాలు, ప్రదేశాలు తిరిగానని, అరుణగిరి దర్శనంతో కలిగే ప్రశాంతతను వేరెక్కడా అనుభవించలేదన్న అభిప్రాయం తెలియజెప్పారు. భగవాన్ అరుణాచలం అత్యంత ఆకర్షణ కలిగిన కొండ అని మెచ్చుకునేవారు. ఆ గిరిని గురించి ఎంత తీవ్రంగా ఆలోచిస్తే మనసు అంత ప్రశాంతతను చెందు తుందనే వారు. కాశీలో చనిపోవడంతో మోక్షం ఖాయమన్నట్లు, అరుణాచలాన్ని స్మరిస్తే చాలు మన అహం నాశనమవుతుందని, అదే భగవదనుగ్రహం వుంటే, శాశ్వతంగా మన అహం నశిస్తుందన్నది గట్టి నమ్మకం.

## మనసుపై ముద్ర

మా తండ్రిగారు కొడైకెనాల్‌లో ఒక యూరోపియన్ స్కూలులో పనిచేసేవారు. నన్ను మాత్రం మ్యునిసిపల్ స్కూలులో చేర్చారు. దాదాపు 8వ తరగతి తరువాతి నుండి వేరే చోట్ల హాస్టళ్ళలో వుండి



చదువుకోవడం అలవాటయింది. ఉద్యోగంలో చేరిన తరువాత కూడ హాస్టల్లో వుండడం తటస్థించింది. అప్పటి నుండి ఇతరులతో ఎక్కువగా మాట్లాడడం గాని, ఆహారం, దుస్తులను గురించిన శ్రద్ధ తీసుకోవడం గాని లేకుండ వుండేవాడిని. మద్రాస్ క్రిస్టియన్ కాలేజ హాస్టల్‌లో వుంటున్న రోజుల్లో రాత్రిళ్ళు ఏమీ తినక వుంటున్నప్పుడు అక్కడ వంటపని చేస్తున్న కార్యకర్త ఒత్తిడితో రాత్రిళ్ళు బ్రెడ్, మజ్జిగ మాత్రం తీసుకునేవాడిని. కాలాంతరంలో అతన్ని కలిసినప్పుడు ఆ విషయం గుర్తుచేసుకున్నాం కూడ.

నేను హాస్టళ్ళలో వుంటున్న కారణంగా, దగ్గర డబ్బు వున్నప్పుడు రమణాశ్రమానికి వెళ్ళేవాడిని. నా తల్లిదండ్రులు ఈ విషయంలో ఎప్పుడూ ఆటంకపరిచేవారు కాదు. కాని నా ధోరణిని గమనించిన కొందరు నా ప్రవర్తన విచిత్రంగా వుందని అనుకునేవారు. కొందరైతే ఏ ఉద్యోగం చేయలేనని అభిప్రాయపడేవారు. యథార్థానికి ఆ రోజుల్లో నాకు ఆనర్స్ చదువు పూర్తి చేసిన తరువాత పల్లెటూళ్లో వుండిపోదామన్న ఆలోచన అప్పుడప్పుడు వచ్చేది. చాలా తరచుగా ఆశ్రమానికి వెళ్ళడం మంచిదికాదని, దానివల్ల నేను సాధారణ ప్రాపంచిక జీవితానికి పనికిరాకుండ పోవచ్చునని ఇతరులు అంటున్నప్పటికీ, నా తండ్రిగారు మాత్రం ఆ మాటలను పట్టించు కునేవారు కాదు. తమకు అలాంటి అభిప్రాయం లేదని, అది సరియైనది కాదని చెప్పేవారు.

నేను రమణాశ్రమానికి వెళ్ళడం మొదలుపెట్టిన రోజుల నుండి కూడ ఇతరులతో కలిసి మాట్లాడే అలవాటు చాలా తక్కువగా వుండేది. తెలిసిన వ్యక్తులు కలిసినప్పుడు కూడ పెద్దగా మాట్లాడే

వాడిని కాను. ప్రపంచం గురించి ఎక్కువగా తెలియని రోజులవి. మాట్లాడవలసిన అవసరం ఏమిటన్న ఆలోచన ఎక్కువ. భగవాన్ వున్నచోట, ఆయన సమక్షంలో వుండడమన్నదానికే ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చేవాడిని. అంతేగాని మహర్షిని ఏదో ప్రశ్నించాలన్న కోరిక ఎప్పుడూ లేదు. ఆయన సమక్షంలో ధ్యానం చేస్తూ కూర్చోవాలని మాత్రమే ఆశించేవాడిని. మహర్షి కదలికలను గమనిస్తూ హాలు బయటకు ఆయన వెళ్ళినప్పుడు కొంతదూరం నేను వెళ్ళడం జరిగేది. ఊరికి బయలు దేరేముందు మహర్షికి నమస్కరించి, సెలవు తీసుకోవడం, ఆయన సమ్మతిగా తల ఊపడం, అంతే. సంభాషణ లేదు.

ఆశ్రమానికి వెళ్తున్న సమయాలలో కూడ నేను ఆదిశంకరుల రచన 'వివేక చూడామణి'ని చదివేవాడిని. భగవాన్ సమక్షంలోనూ అందులోని విషయాలను గురించి ఆలోచించేవాడిని. ఆ రచనలోని మొదటి భాగంలో శంకరుల వివరణ తీవ్రంగా విచారించి గమనిస్తే, ముఖ్యంగా చిన్న వయసులో, ప్రపంచానుభవం లేని వారిపై నూతన ప్రభావం చోటుచేసుకుంటుంది. నాకు శరీరంపై విరక్తి కలిగింది. అలాంటి నేపథ్యంలో భగవాన్ వంటి మహానుభావుల సన్నిధికి లోనైతే, అది మరింత బలమైన అనుభూతిని చూపుతుంది.

### అపారమైన కరుణ

మహర్షి ఆరోగ్యం 1950 సం॥ ప్రాంతానికి బాగా క్షీణించింది. వార్తాపత్రికలలో ఆయన ఆరోగ్యం గురించి వార్తలు వస్తుండేవి. భగవాన్‌కు చాలా బాగులేదన్న సమయాల్లో నేను ఆశ్రమానికి వెళ్ళి కొద్ది రోజులు వుండి వచ్చేవాడిని. అప్పుడు భగవాన్ వరాండాలో



నిర్వాణ గదిలో వుండేవారు. నడవలేకపోయేవారు. అక్కడి నుండే దర్శనం ఇచ్చేవారు. ఆయనకు ఇష్టం లేకపోయినప్పటికి, ప్రక్కనే మరుగుదొడ్డి ఏర్పాటు చేశారు. ఆ కొంచెం కూడ ఎంతో కష్టంతో నడిచేవారు. పుండునుండి నెత్తురు కారుతూ వుండేది. అది చూడలేక సందర్శకులు బాధపడేవారు. కొందరు ఏడ్చేవారు. కాని భగవాన్ అందరివైపు ఎంతో కృపతో చూసేవారు. ఎందుకు అలాగ బాధపడు తున్నారు, అంతా బాగవుతుందనేవారు. జయంతి రోజున అరుణా చలేశ్వర ఆలయం నుండి వచ్చిన ఏనుగు ఆశ్రమంలో మహర్షి ఎదుట కొంతసేపుండి, తొండంతో నమస్కరించి వెళ్ళింది.

ఎంతో బలహీనంగా వున్నప్పటికీ, తమను తాకడానికి సోఫా నుండి ఎత్తుకుని లేపడానికి, అంగీకరించేవారు. ఆఖరున మాత్రం సోఫా నుండి లేచాక, నిలబడి వున్నప్పుడు బాత్‌రూమ్‌కు వెళ్ళడానికి పరిచారకుడిని పట్టుకోనిచ్చేవారు. దాని కోసం ఇద్దరు పరిచారకు లను సర్వాధికారి నియమించారు. ఒకసారి లేచినిలబడి నప్పుడు, సహాయకుడు పట్టుకున్నాడన్న భావనతో కదలబోయి, క్రిందపడ్డారు. బాత్‌రూమ్‌కు వెళ్ళబోతూ, రెండవ సహాయకుడితో తాము పడిన సంగతిని ఏ మాత్రం కూడ సర్వాధికారికి తెలియనివ్వవద్దని, అతడిని తిడతారని, గట్టిగా చెప్పారు. ఆ పరిస్థితుల్లో కూడ ఎంత కరుణ చూపేవారో గమనించవచ్చు.

మనం అప్పుడప్పుడు ఇతరుల పట్ల కొంత దయ, దాక్షిణ్యా లను చూపే ప్రవర్తనను అనుసరిస్తుంటాము. కాని, ఎల్లప్పుడూ అన్ని పరిస్థితుల్లోను, ఇతరులపై సంపూర్ణమైన దయ, కరుణలను ప్రసాదించడం మహర్షికి మాత్రమే సాధ్యమైన విషయం. అందుకే భగవాన్ ఇరవైనాలుగు గంటలూ భగవానే.

# అమరత్వ చేతన

(గత సంచిక తరువాయి) - డా. తోట శ్రీనివాస్

బ్రం: విచారణకు ఏకాంతం అవసరమా?

భ: ఏకాంతం అంతటా ఉంటుంది. వ్యక్తి ఎప్పుడూ ఏకాకే. మన పనంతా దాన్ని మన అంతరంగంలో వెతకడమే. అది మన బయట దొరికేది కాదు.

ఏకాంతం మనసులో ఉంటుంది. మనిషి రణగొణుల ప్రపంచం మధ్యలో ఉన్నా ప్రశాంతత అనుభవించవచ్చు. ఏకాంతంలో ఉన్న అనుభవాన్ని పొందవచ్చు. "The mind is in its own place, you can make a heaven of hell, hell of a heaven". వేరొక వ్యక్తి సుదూరమైన అరణ్యంలో ఉండి కూడా మనసును నిగ్రహించుకోక పోవచ్చు. కోరికలలో తగులుకున్న వ్యక్తి ఎక్కడున్నా ఏకాంతాన్ని అనుభవించ లేడు. ప్రపంచంతో నిస్సంగంగా ఉన్న వ్యక్తి ఎప్పుడూ ఏకాకే. వాడు ఎప్పుడూ ప్రశాంతంగానే ఉంటాడు. సంగత్వంతో కూడిన పని ఎప్పుడూ బంధాన్ని కలుగజేస్తుంది.

బ్రం: ఇతరులకు సహాయం జేయడం....

భ: మీ ఉద్దేశాలను, ఆలోచనలను, సమాజాన్ని, ప్రపంచాన్ని ఉద్ధరించాలనే ఆశయాలను ప్రక్కకు పెట్టండి.

అదంతా సృష్టికర్త పని. అది ఆయనే చూసుకుంటాడు. అవసరం మేరకు ఆ పని ఆయనే చేస్తాడు. నువ్వు ఏంచేయ గలవు. ఒక తెల్లవెంట్రుకను నల్లగానో నల్ల వెంట్రుకను తెల్ల



గానో మార్చగలవా? మరి ఏం చేయగలననుకుంటున్నావు? నీ అహాన్ని వదిలేయి. దేన్నో ఉద్ధరిద్దామనుకోవడం భ్రమ. ఏదో కార్యాన్ని నిర్వర్తించడం కోసం భగవంతుడు నిన్నొక పనిముట్టుగా వాడుకోవచ్చు. దానికి నువ్వు గర్వించకు. అనంతమైన దివ్యశక్తి అంతటా ప్రసరిస్తున్నప్పుడు వ్యక్తి పూజకు అసలే ఆస్కారం లేదు. అదే జరిగితే వ్యక్తిగత ప్రశంసలు, ఖ్యాతికోసం ప్రాకులాడితే మానవతకు ప్రయోజనం జరుగదు.

ప్రజలు మాట్లాడుకునే సాతాను, దయ్యం, ఇవన్నీ వాళ్ళ అజ్ఞానానికి నిదర్శనాలు. ఆత్మజ్ఞానం లేకపోవడానికి ఆనవాళ్ళు.

ప్రపంచంలో చాలామంది సంతోషంగా వుండడానికి, లేక పోవడానికి కారణం ఆత్మజ్ఞానం లేకపోవడమే. నిజమైన ఆనందం ఆత్మానందమే. మిగతావన్ని చేయడం, ఎండ మావుల కోసం పరుగెత్తడం లాంటివే. తన ఆత్మానందాన్ని శాశ్వతానందంగా, బ్రహ్మానందంగా మల్చుకోవాలి. ఎల్లప్పుడు ఆనందంగా ఉండాలంటే తన ఆత్మను మరవకుండా ఉండడమే.

బ్రం: మా మిత్రుడు తన డబ్బును ఖర్చుపెట్టి సంఘసేవ చేయాలను కుంటున్నాడు.

భ: నిస్వార్థమైన సేవ చాలా ఉపయోగకరం, దాన్ని ప్రయోజనాన్ని విస్మరించలేం. ఆ సేవ ఆయనను పరిశుద్ధుణ్ణి చేస్తుంది. దానివల్ల ఎంతో ధార్మిక శక్తిని పొందుతాడు. నిస్వార్థమైన

సంఘసేవ వ్యక్తిని ఆధ్యాత్మిక అందలం ఎక్కిస్తుంది. ఆ సేవ సంఘ సేవ, స్వార్థపర సేవ కాదు. భగవత్ దృక్పథంతో చేసిన సేవ చిత్తశుద్ధిని, ఆధ్యాత్మిక శక్తిని ఇస్తుంది. అలాంటి శారీరక కర్మలు మనసును శుద్ధిచేస్తాయి. సంఘసేవ ఆధ్యాత్మిక శక్తికి తొలిమెట్టు.

బ్రం: కాని సంఘ సేవ వల్ల ధ్యానానికి సమయం లేదు.

భ: ఏది కాని సంఘసేవతోనే ముగిసిపోదు కదా. దృష్టి ఎపుడూ, అత్యున్నతమైన సత్యం పైనే ఉండాలి.

బ్రం: ఇతరుల ఆధ్యాత్మిక అజ్ఞానాన్ని, సోమరితనాన్ని పోగొట్టడం ఎలా?

భ: మీ అజ్ఞానాన్ని, మీ సోమరితనాన్ని పోగొట్టుకున్నారా? మీ ప్రశ్నలన్నీ ఆత్మ వివేచనకు, ఆత్మశోధనకు వెచ్చించండి. అలా చేయడం వల్ల మీలో ఉద్భవించిన శక్తి ఇతరులపై కూడా ప్రభావం చూపుతుంది.

బ్రం: మరి నా (పాల్‌బ్రంటన్ యొక్క) ఉత్తేజితమైన కర్మ యేంటి?

భ: పనులు సాగనివ్వండి. అది పరిశుద్ధమైన ఆత్మను ప్రభావితం చేయలేవు. విచిత్రమైన విషయమేమిటంటే ప్రజలు వాళ్ళు చేసే పనులు వాళ్ళే చేస్తున్నామనుకుంటారు. ఓ ఉన్నతోన్నత మైన శక్తి అన్నీ చేస్తుంది. ప్రజలు ఒట్టి పనిముట్లు మాత్రమే. ఈ విషయం జనానికి అర్థమైతే వాళ్ళు కష్టాల నుండి స్వేచ్ఛగా బయటపడతారు. వాళ్ళు చేస్తున్నారనుకుంటే, చిక్కుల్లో పడి పోతారు. గుడిలోని ఎత్తైన గోపురాన్ని భరించేది పునాది అనే విషయం మరవరాదు. గోపురం ఎంతో దివ్యంగా, ధన్యంగా కనిపిస్తుంది. ఎంత ఎత్తైన ప్రాకారమైనా దాన్ని భరించేది పునాది అనే విషయం గుర్తుంచుకోవాలి.



బ్రం: సంఘ సంస్కరణపై మీ అభిప్రాయం చెప్పండి.

భ: ఆత్మ సంస్కరణ సంఘ సంస్కరణపై ప్రభావం చూపుతుంది. ప్రతి వ్యక్తి ఆత్మోద్ధరణకు పాటుపడితే అదే సంఘ సంస్కరణకు తోడ్పడుతుంది.

బ్రం: నేనొక డాక్టరుని. నేను ప్రజలకు ఎలా ఉపయోగపడాలి?

భ: అన్ని రోగాల నిర్మూలనకు జ్ఞానమార్గమే శాశ్వతమైనది. ఈ విషయాన్ని రోగులు గమనించాలి. అది వాళ్ళ వాళ్ళ సంస్కారాన్ని బట్టి ఉంటుంది. లేకపోతే ఒక రోగం నయమవుతే మరో రోగం పుట్టుకొస్తుంది. శరణాగతి అన్ని రోగాలకు దివ్యౌషధం. సంసారం కంటె పెద్దరోగం ఏమిటి? “ఇహ సంసారే బహు దుఃఖారే, కృపయా పారే పాహి మురారే” అన్నారు శంకరాచార్యులు..

బ్రం: ఓ యువకుడొచ్చి తనకు ప్రపంచంలోని భౌతికతను రూపు మాపడానికి కావలసిన శక్తినిమ్మని భగవాన్‌ను అడిగాడు.

భ: చేతకాని ప్రజలు మానవ సంక్షేమం కోసం భగవత్ శక్తి కావాలనుకుంటారు, కోరుకుంటారు. ఇది ఓ కుంటివాడు తన కాళ్ళకు సహాయం చేస్తే నా శత్రువును ఓడిస్తానన్నట్టుంది. ఉద్దేశం మంచిదే కాని దీంట్లో తాత్వికత లోపించింది.

బ్రం: నేను ఇతరులకు సహాయం ఎలా చేయాలి?

భ: నువ్వు "ఇతర" అనే వారెవరు? నీ సహాయం తీసుకోవడానికి, నువు సహాయం చేయడానికి? నువ్వంటున్న "నేను" ఏంటో మొదలు తెలుసుకో, ఆ తరువాత మిగతావన్నీ తెలిసిపోతాయి.

బ్రం: పాశ్చాత్యులు యోగులు ఏకాంతంగా ఉండి ఎంత సహాయం చేస్తారో తెలుసుకోలేరు?

భ: యూరప్ అమెరికా అన్నది నీ మనసు సృష్టించిన భేదాలు. నువు కల కని మెలకువ వచ్చిన తరువాత నీకు కలలో కని పించిన వ్యక్తులు కూడా మేల్కొంటున్నారనుకుంటున్నావా?

మీరు ఇతరులను గాఢంగా ప్రేమించండి కాని ఆ విషయాన్ని రహస్యంగా ఉంచండి, బయటకు ప్రదర్శించకండి. ఆ విషయం బయటకు చెప్పకండి. మీ కోరికలు తీరితే ఎగిరి గంతేయకండి. ఒకవేళ నిరాశకు గురయితే బాధపడకండి. మీ ఆనందం వంచించి మీ దుఃఖానికి దారితీయవచ్చు. ఏది జరిగినా పొంగుల్లో, క్రుంగుల్లో మీరు మీరుగా ఉండండి. ఏవీ మిమ్మల్ని ప్రభావితం చేయకుండా చూసుకోండి.

బ్రం: నేను ఇతరులకు ఏ రకంగా సహాయం చేయాలి?

భ: ఊరికే 'ఇతరులు' అనే మాటేంటి - ఉన్నదంతా ఒకటే. నేను, నువ్వు, వాడు, ఆమె, ఇతడు అన్ని ఒకే ఒక ఆత్మ అని తెలుసు కోవాలి. 'ఇతరుల' సమస్య అని నువు అనుకున్నప్పుడు ఆత్మకు ఇతరంగా వేరుగా ఆలోచిస్తున్నావన్న మాట. ఆయనని కూడా నీ ఆత్మగానే భావించి సహాయం చేయి.



## ఆరోగ్య విషయాలు

బ్రం: ఆత్మ విషయంలో ఈ శరీరానికి ఏమైన విలువ ఉందా?

భ: ఔను ఉంది. ఈ శరీరం ద్వారానే కదా మనం ఆత్మ సాక్షాత్కా రాన్ని పొందుతాం. "శరీరం ఖలు ధర్మ సాధనం".

బ్రం: మరి ఆహార విషయ మేమంటారు?

భ: ఆహారం మనసును ప్రభావితం చేస్తుంది. సాత్వికాహారం ఆరోగ్యానికి, మనసుకు మంచిది. యోగాభ్యాసానికి, శాకాహారమే ఉత్తమమైనది.

బ్రం: మరి శాకాహారానికి అలవాటుపడనివారి సంగతేంటి?

భ: అలవాటు పరిసరాల ప్రాబల్యం మీద ఆధారపడి ఉంటుంది. ఇక్కడ మనసు ముఖ్యం. నిజమేమంటే కొన్ని ఆహార పదార్థాలు రుచికరంగా ఉంటాయని కొంతమంది నిర్దేశించు కుంటారు. మాంసాహారంలో దొరికే పోషక విలువలన్నీ శాకాహారంలో కూడా దొరుకుతాయి. జ్ఞానోదమయిన వ్యక్తిని తను భుజించిన ఆహార పదార్థాలు ఏలాంటి ప్రభావితం చేయవు. కాని తిన్నగా శాకాహారానికి అలవాటుపడండి.

బ్రం: నేను అహింస గురించి మాట్లాడుతున్నాను, మరి మొక్కల్లో కూడా ప్రాణముంటుంది.

భ: అవును నువు కూర్చున్న టైల్స్ లో కూడా ప్రాణముంది కదా.

బ్రం: మాంసాహారం భుజిస్తూ కూడా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, వెలుగును పొందవచ్చా?

భ: ఔను. కాని మాంసాహారాన్ని మెల్లమెల్లగా త్యజించండి. సాత్వికాహారానికి పాటుపడండి. ఆత్మసాక్షాత్కారం పొందిన తరువాత మీరు ఏం భుజిస్తున్నారో ఏలాంటి భేదాన్ని కలుగ జేయదు. ప్రజ్వరిల్లుతున్న అగ్నిలో ఏ ఇంధనమైనా అంతే కదా, ఒకటే కదా.

(ఓ భక్తుడు భోజనంలో చాలా నియమం పాటిస్తూ రోజుకు ఒక్కొక్కసారి చాలా మోతాదులో భోజనం చేసేవాడట. అది చూసి భగవాన్ ఆ కాఫీ కూడా మానేస్తే పోలా అన్నారట. అంటే భోజనంలో అంత మితం పనికిరాదని హెచ్చరించారట)

బ్రం: అంటే మీ ఉద్దేశంలో మాంసాహారం మరియు మద్యం త్యజించమనా?

భ: ఔను. మొదట్లో కొందరికి అవసరం కావచ్చు. ఎవరయినా దానికి అలవాటు పడితే మానేయడం కష్టం. ప్రతి ఆహారంలో తగు పోషక విలువలుంటాయి. ఆహారం మెదడుపై ప్రభావం చూపుతుంది. ఆత్మ విచారణ చేసే వాళ్ళకు సాత్విక ఆహారం మంచిదని శాస్త్రీయంగా ఋజువు చేయడం జరిగింది. సాత్వికాహారం ధ్యానానికి బలంగా తోడ్పడుతుంది. మాంసాహారం లాంటి రాజసిక ఆహారం తామసిక శక్తుల్ని మేల్కొలిపి ధ్యానానికి భంగం కలుగజేస్తుంది.

బ్రం: మీరు పాలు తీసుకుంటారు మరి గ్రుడ్లు ఎందుకు తీసుకోరు?

భ: సాధు జంతువులైన ఆవులు తమ దూడలకు పోగా ఇచ్చిన పాలను నేను స్వీకరిస్తున్నాను. కాని గుడ్లలో జీవాలుంటాయి కదా. అది జీవహింస అవుతుంది.



బ్రం: నేను రోజుకు మూడు, నాలుగుసార్లు భోంచేస్తాను. నేనీ శరీర వాంఛలతో వేగలేక పోతున్నాను. ఈ కోరికలన్ని త్యజించి నేను స్వేచ్ఛగా ఉండే మార్గం ఏమైనా ఉందా?

భ: ప్రపంచంతో సంగం (attachment) చాలా ప్రమాదకరమైనది. రోజుకు రెండు మూడు సార్లు తినడం తప్పేమి కాదు. కాని 'నాకు ఇది కావాలి, అది కావాలి, ఇప్పుడు అది మాత్రమే తింటాను' అనే కోరికలు మంచివి కావు. వేకువలో 12 గంటల్లో భోజనం చేస్తున్నావు. కాని నిద్రపోయే 12 గంటల్లో ఏమీ తినడం లేదు కదా, మరి నిద్ర నీకు ముక్తి నిస్తుందనుకుంటున్నావా?

ఏమి చేయకుండా ఉండడం ముక్తినిస్తుందనుకోవడం పొరపాటు.

బ్రం: పొగ త్రాగవచ్చా?

భ: లేదు. పొగాకు విషం. పొగాకు కొంత ఉత్తేజాన్నిస్తుంది. ఇంకా త్రాగాలనిపిస్తుంది. ధ్యాన సాధకులకు పొగత్రాగడం పెద్ద అడ్డంకి.

**నూతన సంవత్సర శుభాకాంక్షలు**

*శ్రీరమణజ్యోతి పాఠక మహాశయులకు శ్రీరమణ కేంద్రం, శ్రీరమణజ్యోతి సంపాదక వర్గం తరపున '2020' నూతన సంవత్సర శుభాకాంక్షలు.*

## శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# టి.ఆర్. కనకమ్మాళ్

(గత సంచిక తరువాయి) కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి

**భగవాన్ పట్ల కనకమ్మగారి మధుర స్మృతులు మచ్చుకు కొన్ని క్లుప్తంగా:**

1) ఒకరోజు కనకమ్మాళ్‌గారు తన స్నేహితురాలైన ఆనందమ్మ గారితో తాను భగవాన్‌ను అడగాలనుకున్న ప్రశ్నలను అడగలేక పోవడాన్ని గురించి వివరంగా పంచుకున్నారు. అటు తర్వాత ఇద్దరూ గిరి ప్రదక్షిణానికి బయలుదేరే ముందు భగవాన్ దర్శనానికి వెళ్ళినప్పుడు ఎప్పటిలాగానే భగవాన్‌ను అడగాలనుకున్న ప్రశ్నలను ఏమీ అడగలేక 'గిరిప్రదక్షిణ చేసుకొని వస్తాన'నని మాత్రం చెప్ప గలిగారు. వెంటనే భగవాన్ ముందుకు వొంగి ''హా ఏమిటి అన్నారు?'' అలా అనడంతో ఆమె అంతకు ముందు చెప్పిన మాటను కూడా చెప్పలేక అలానే నిలుచుండి పోయారు. అది గ్రహించిన భగవాన్ ''ఆ, గిరిప్రదక్షిణ చేసుకొని వస్తావా, నీకు ఎవరు తోడు వున్నారు?'' అని అన్నారు. వెంటనే ఆవిడ ప్రక్కనే ఉన్నటు వంటి ఆనందమ్మగారు 'నేను వెళ్తున్నాను భగవాన్' అని అన్నారు. ''ఓహో సరే'' అని భగవాన్ ఇద్దరినీ ఆశీర్వదించి పంపారు. భగవాన్‌కు తన పట్ల గల శ్రద్ధకు ఆమె ఎంతో పొంగిపోయారు.

2) ఒకసారి వాళ్ళ నాన్నగారికి బాగోలేదని టెలిగ్రామ్ రావడంతో ఇంటికి ఎలా వెళ్ళాలా అని ఆలోచిస్తూ దాన్ని తీసుకొని గణపతి ముని శిష్యుడైన అప్పుశాస్త్రి వద్దకు వెళ్ళారు. ఆయన ఆమెను, ఆ



టెలిగ్రామ్‌ను భగవాన్ వద్దకు తీసుకు వెళ్ళి ఆ టెలిగ్రామ్‌ను భగవాన్‌కు చూపారు. అది చూసిన వెంటనే ఎవరినీ ఏమీ అడగని భగవాన్ ''ఈమెను ట్రైన్ ఎవరు ఎక్కిస్తున్నారు'' అని అడిగారు. అప్పుడు అప్పుశాస్త్రి స్పందించడంతో భగవాన్ 'సరే' అన్నారు. అలా వాళ్ళు స్టేషన్‌కు వెళ్ళిన వెంటనే వాళ్ళ నాన్నగారు బాగానే ఉన్నట్టు మరో టెలిగ్రామ్ వచ్చింది. అక్కడి వారు ఆ టెలిగ్రామ్‌ను భగవాన్‌కు చూపించారు. అది చూసిన వెంటనే భగవాన్ ఎవరైనా స్టేషన్‌కు వెళ్ళి ఆమెను తిరిగి తీసుకురండి అని అన్నారు. అక్కడ ఉన్నటువంటి వాళ్ళు ఒకరికొకరు మొహాలు చూసుకుంటూ... ఒకరేమో రైలు వచ్చేసి ఉండవచ్చునని, మరొకరేమో వచ్చి ఉండదని... ఇలా అనుకుంటున్నప్పుడు ఆ మాటలు విన్న భగవాన్ ఇప్పుడు ఎవరైనా వెంటనే వెళ్తే తీసుకు రావచ్చు అని అన్నారు. అక్కడ నుంచి స్టేషన్‌కు 3 మైళ్ళు నడవటానికి ఎవరూ సుముఖత చూపక అలానే నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఇంటికి వెళ్ళినటువంటి ఆమెకు అప్పుశాస్త్రి నుంచి పై విషయాలన్నింటి తోటి ఉత్తరం చేరింది. అది చూసిన వెంటనే భగవాన్ స్వయంగా తనకు చెబుతున్నట్లుగా ఆమెకు అనిపించింది. అంటే ఆ ఉత్తరాన్ని భగవాన్‌గా తలచింది. భగవాన్‌కి తన మీద గల అనుగ్రహాన్ని అప్పటికి కాని గుర్తించనటువంటి ఆమెకు కన్నుల వెంట ధారాపాతంగా నీరు కారాయి. అది గమనించిన ఆమె నాన్నగారు ఆమెను ఓదార్చారు.

3) ఒకరోజు పాత హాల్‌లో ప్రముఖులు అందరూ కూర్చునే ముందు వరుసలో అంతా ఖాళీగా ఉండటంతో మజూన్‌దారు,

కామేశ్వరమ్మ మొదలగు భక్తులతో ఆమె కూడా ముందు వరుసలో కూర్చున్నారు. ఆవిడ కూర్చున్న వెంటనే శ్రీ భగవాన్ యొక్క చూపు ఆమె వైపు మాత్రమే నిలిచి వుంది. ఆ చూపు తీవ్రతకు తట్టుకోలేని ఆమె వెంటనే కళ్ళు మూసుకున్నారు. అటు తర్వాత కూడా చాలా సేపటి వరకు ఆ చూపుతో వచ్చిన శాంతి, సంతోషం అలానే నిలిచి పోవడాన్ని ఆమె గ్రహించారు. ఇలా కాసేపు జరిగిన తర్వాత మళ్ళీ ఆమె కళ్ళు తెరిచి భగవాన్ వైపు చూసిన వెంటనే ఆ తీక్షణతకు తట్టుకోలేక కళ్ళు వాటంతట అవే మూసుకు పోయాయి. అలా ఎంతసేపు ఆవిడ కళ్ళు మూసుకున్నారో తెలియదు. ఆ సమయంలో మౌని శ్రీనివాసరావు అక్కడికి కొన్ని ఉత్తరాలను తెచ్చి భగవాన్‌కి అందించారు. అటు తర్వాత మౌని వెళ్ళిన వెంటనే భగవాన్ గోశాలకు వెళ్ళారు. ఇదంతా గమనిస్తున్నటువంటి ఆమె ప్రక్కనే కూర్చున్న తెలుగు ఆవిడ కామేశ్వరమ్మ ఆమెను కౌగలించుకుని కళ్ళ నీళ్ళతో "నువ్వు చాలా అదృష్టవంతురాలివి, నువ్వు కళ్ళు మూసుకున్నప్పటి నుంచి భగవాన్ ఒక క్షణం కూడా కళ్ళు మరల్చకుండా నిన్నే చూస్తున్నారు. నేను శ్రీ భగవాన్‌ను, నిన్నూ చూస్తూనే ఉన్నాను. ఇవాళ వారు నీ పట్ల ఎంతో దయ చూపారు. ఇంతకన్నా ఏం కావాలి నీకు" అని అంటూ మరొక్కసారి ఆవిడని కౌగిలించుకున్నారు. అప్పటికే ఎంతో ఆనంద పారవశ్య స్థితిలో ఉండడం వల్ల ఆమె కామేశ్వరమ్మకు ఏమీ బదులు చెప్పలేక అలానే నిలిచిపోయారు. ఆ సమయంలో ఆమెకు కలిగిన మనశ్శాంతి ఎన్నో రోజుల పాటు నిలిచిందని కాలాంతరంలో ఆమె తోటి భక్తులతో చెప్పారు.



4) భగవాన్ ప్రత్యక్ష శిష్యురాలైన ఆమె భగవాన్ రచనలను గొప్ప మహాత్ముడు, కవి అయిన మురుగనార్ ద్వారా విన్నారు. ఆమె చివరి రోజులలో తిరువణ్ణామలై నుండి చెన్నైకి ఆరోగ్య పరీక్షల కొరకు వెళ్తుండేవారు. అలా ఒకసారి ఆమె వెళ్ళినప్పుడు ఆమె "ఉళ్ళదు నార్పదు" అనే గ్రంథం యొక్క ప్రవచనం వినడానికి నోచూర్ వెంకటరామన్(శ్రీరమణచరణతీర్థ) చెప్తున్న సభకు వెళ్ళారు. వారం రోజులు పూర్తిగా ప్రవచనాలు విన్న ఆమె వెంకటరామన్‌తో "భగవాన్ మీ ద్వారా మాట్లాడుతున్నారు" అని ఆమె ఆయనను తిరువణ్ణామలై లోని ఆమె ఇంటికి తీసుకు వెళ్ళారు. ఆమె ఇంట్లో ఏ ప్రదేశంలో అయితే మురుగనార్ కూర్చోని ఆమెకు శ్రీ భగవాన్ బోధనలు వివరించారో అదే ప్రదేశంలో వెంకటరామన్‌ను కూర్చుండ బెట్టి మూడు రోజుల పాటు "ఉళ్ళదు నార్పదు" అనుబంధాన్ని చెప్పించుకున్నారు. అది పూర్తి అయిన పిమ్మట ఆమె "భగవాన్ తమిళం రాని నాచేత తన బోధనలకు తమిళంలో వ్యాఖ్యానము వ్రాయించారు. ఇప్పుడు భగవాన్ తమిళము నేర్చుకొనని మీ చేత తన బోధనలను గురించి తమిళంలో మాట్లాడేటట్లు చేశారు" అని అన్నారు. వెంటనే వెంకటరామన్ ఆమెతో ఎంతో గౌరవంతో "అమ్మా మీ వలన మేము శ్రీ భగవాన్ బోధనలను అర్థం చేసుకోగలిగి నాము" అన్నారు. భగవాన్ యొక్క అదృశ్యశక్తి ఆయన మీద ఎలా ప్రవహించిందో వివరించి పరమానందం చెందారు.

**భగవాన్ హాల్ నుండి బయటికి నడుస్తున్నప్పుడు ఆయన యొక్క వర్ణన ఆవిడ మాటల్లో:**

- "సన్నగా, పొడవుగా, కొద్దిగా వొంగి ఉండేవారు" (1940లో).

ఆయన నడవలేని స్థితిలో ఉంటే ప్రక్కన పరిచారకులు నడిపిస్తుండే వారు. భౌతిక దేహం బలహీనంగా వున్నప్పటికీ ఆయన చూపు చాలా తీక్షణంగా ఉండేది. దేహం బలహీనమైనప్పటికీ ఎంత దూరమైనా నడిచే వెళ్ళేవారు. ఆయన శరీరమంతా బంగారపు కాంతితో మెరిసిపోయేది. గోశాల నుంచి బయటికి వచ్చిన ప్రతిసారి ఒక రాయి మీద కూర్చునేవారు. ఆయనంతట ఆయన ఎప్పుడూ భగవంతుడిగా ప్రకటించుకోలేదు. ఆయన చెప్పిన బోధనలను ఆచరించమనేవారు'' అని ఆమె ఎప్పుడూ చెప్తుండేవారు. అంతేగాక - ఆవిడ మనస్సులో కలిగిన ప్రశ్నలకి సమాధానాలు భగవాన్ యొక్క ఒక చూపుతోనే అందేవని, దానిని మాటలలో వర్ణించ వీలులేనివిగా ఆమె తరచూ చెప్పేవారు. కొంతమంది ఆమెను ''ఆత్మ విచారణా సాధన గురించి ప్రశ్నలను భగవాన్‌ను అడగవచ్చు కదా'' అని అన్నప్పుడు వెంటనే ఆమె ''భగవాన్ సాధనను తూ.చ. తప్పకుండా చేస్తున్నటువంటి తనకు ఆయనను చూసిన వెంటనే ఎలాంటి సందేహాలు వచ్చేవి కాదని, మనస్సంతా ప్రశాంత మయ్యేది'' అని చెప్పారు.

**కనకమ్మాళ్‌గారు ఆశ్రమంలో ఉన్నప్పుడు ఆశ్రమానికి వచ్చి సమాధి మందిరాన్ని దర్శించిన భక్తుల భావాలు ఆమె చెప్పినవి క్లుప్తంగా:**

అన్నీ తెలుసునని వచ్చినటువంటి చాలామంది వ్యక్తులు కూడా భగవాన్ సమక్షంలో ఏమీ తెలియని స్థితిలోకి వెళ్ళిపోవడాన్ని ఆమె గమనించారు. అందరిలో ఉన్నటువంటి అనేక ప్రశ్నలకు భగవాన్ చూపుతోటి వాళ్ళకి సమాధానాలు దొరికేవని అనేవారు. భగవాన్ సమాధి మందిరం దగ్గరకు వచ్చే భక్తులకు అకారణంగా



కన్నీళ్ళు రావడం ఆవిడ గమనించారు. ''వచ్చినటువంటి భక్తులు ఆశ్రమంలో ఉంటున్న మీరు చాలా అదృష్టవంతులు'' అని అనేవారు. భగవాన్ సజీవంగా ఉన్నప్పుడు ఆయనతో గడిపిన ఎవ్వరికైనా ఇంతటి ప్రశాంతమైన స్థితి వస్తుందనీ, మీరు ఆ రోజులలో ఉండి ఉంటే ఈ స్థితినే మీరూ పొందేవారని ఆమె అనేవారు. భగవాన్ దేహాన్ని వదిలినప్పటికీ ఇప్పటికీ భగవాన్ అనుగ్రహం భక్తులపై అలానే కొనసాగుతున్నదని అక్కడికి వచ్చిన భక్తులతో అనేవారు. సర్వాంతర్యామి అయిన భగవంతుడు భగవాన్ రూపంలో అరుణాచలంలో మాత్రమే ఉన్నట్లుగా తలచి అక్కడికి వచ్చి సమాధి మందిరాన్ని దర్శించి తిరిగి వెళ్ళేటప్పుడు భక్తులు బాధపడటాన్ని ఆవిడ గమనించేవారు. భగవాన్‌ను దేహం మాత్రమే అని అనుకుంటున్న కొందరు భక్తులకు భగవాన్ ఎప్పటికీ శాశ్వతులని ఆవిడ చెప్పేవారు.

**కనకమ్మాళ్ చివర దశలో ఆశ్రమానికి వచ్చిన భక్తులతో ఆమె చెప్పినవి:**

''ఇక్కడ మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పుడు లక్షల మంది భక్తులతో పాత (ఓల్డ్) హాల్ క్రొత్త (న్యూ) హాల్, అమ్మగారి హాల్ అన్నీ నిండిపోతున్నాయి. భక్తుల మీద భగవాన్ అనుగ్రహం ఇప్పటికీ అలానే పుష్కలంగా ఉంది. ఇక్కడికి ఒకసారి వచ్చి సమాధి మందిరాన్ని దర్శించిన వాళ్ళు మళ్ళీ మళ్ళీ ఇక్కడికే వచ్చేటట్టుగా భగవాన్ చేస్తారు. ఇక్కడ అంబికా అమ్మవారు ఎడమ శరీర భాగంతో తపస్సు చేయడం వలన అమ్మవారికి అర్ధనారీశ్వరత్వం ప్రాప్తించిందని స్థల మహాత్యం చెప్తున్నది. అందుకని ఇక్కడికి వచ్చిన

ఆడవాళ్ళు ఏది కోరుకుంటే అది నెరవేరుతుందని భగవాన్ చెప్పారు. శ్రీరామచంద్రుని తల్లికీ, శ్రీకృష్ణుని తల్లికీ మందిరాలు లేవు. కాని భగవాన్ తల్లి అయిన అళగమ్మకు మాత్రము మందిరం ఉన్నది. భగవాన్ తల్లి భగవాన్ వద్ద ఉంటున్నప్పుడు భగవాన్ చెల్లినుంచి ఆమెను గృహప్రవేశానికి రమ్మని పిలుపువచ్చినా మహర్షి వద్దనే చివరి వరకు ఉండి సిద్ధిని పొందడానికి తయారైనటువంటి ఆమె కూతురు వద్దకు వెళ్ళడానికి నిరాకరించి "నా దేహాన్ని రమణుని చేతులలో నుంచి ముళ్ళలోకి విసిరి వేసినా నేను ఇక్కడే ఉంటాను, నేను ఎక్కడికీ వెళ్ళను" అని అన్నారు. అలాంటి ఆవిడకు భగవాన్ సమక్షంలో మందిరం కట్టించడము, అక్కడ శ్రీచక్రాన్ని స్థాపించడము అనేవి లోక కళ్యాణం కోసం మాత్రమే. మురగనార్ అనే భక్తుడు అప్పటి రోజుల్లోనే భగవాన్ యొక్క శక్తి కాలాంతరంలో సుదీర్ఘంగా నిలిచిపోతుందని, అది చూడటానికి మనం ఎవరమూ ఉండమనీ అన్నారు. ఇప్పటికి కూడా భక్తులలో అదే విశ్వాసం కొనసాగడం కనిపిస్తున్నది. ప్రస్తుతం ఎన్నో రమణకేంద్రాలు, భగవాన్ సంస్థలు ప్రపంచం అంతటా భగవాన్ యొక్క ఉనికిని చాటుతున్నాయి''... అని ఆమె చివరి దశలో భక్తులతో చాలా ఆవేశపూరితంగా చెప్పారు. అంతేకాక భగవాన్ యొక్క శక్తిని వర్ణించడానికి తనకున్న శక్తి సరిపోదనీ, అది ఇప్పుడే కాదు ఎప్పటికీ అలానే నిలిచిపోతుందని ఆమె గట్టిగా చెప్పారు.

భగవాన్ యొక్క 130వ జయంతి రోజున 1 జనవరి, 2010లో ఆమె భగవాన్‌లో ఐక్యమొందారు. అప్పటికామె వయస్సు 88 ఏళ్ళు.

*(ఆధారం: శ్రీరమణ మహర్షితో ముఖాముఖి, 24మహాత్ములలో నా మధురస్మృతులు, ఇంటర్‌నెట్)*



# శ్రీ భగవాన్ సేవలో

- జి. శ్రీహరిరావు

## 5. అమ్మకు అందమైన సమాధి

1922 మే నెల మధ్యకు, అమ్మ అలఘమ్మ ఆరోగ్యం రోజురోజుకు క్షీణించసాగింది. మాటిమాటికీ, ఆమె ఏకైక మనుమడినైన నన్ను తలుచుకుంటోందని తెలిసింది. నాకపుడు ఏడేళ్ళ వయస్సు. ఆమె ఆరోగ్య పరిస్థితి చాలా ఆందోళనకరంగా వుందని పిచ్చు అయ్యర్‌కు ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ వచ్చింది. మేము వెంటనే కుంద్రాకుడి నుండి రైలులో బయలుదేరి 1922 మే 20వ తారీఖు ఉదయానికి చేరుకున్నాం. కానీ, అమ్మ అలఘమ్మ అంతకుముందు రోజు రాత్రి 8 గంటలకు స్వర్గస్థులయ్యారు. పాలితీర్థం దగ్గర సమాధి చేయటానికి ఆమె దేహాన్ని కొండ కిందకు తీసుకువెళ్ళారు. శ్రీ భగవాన్ కుంజుస్వామిని రైలు స్టేషన్‌కు పంపి, మమ్ములను తిన్నగా సమాధి స్థలం దగ్గరకు రప్పించే ఏర్పాటు చేసారు. అంత్యక్రియలు, సమాధి కార్యక్రమం నాతో చేయించాలని శ్రీ భగవాన్, వారి భక్తులు నిర్ణయించారు. మహాజ్ఞానికి జన్మనిచ్చిన ఆ పుణ్యజీవికి అంత్యక్రియలు జరిపే అదృష్టం నాకు దక్కింది. కాశీ నుంచి ప్రత్యేకంగా తెప్పించబడిన శివలింగాన్ని సమాధి మీద ప్రతిష్ఠించడం జరిగింది. ఆ రోజు నుండీ నా తండ్రిగారు సమాధి వద్దనే నివసించడం ఆరంభించారు. శ్రీ భగవాన్ స్కందాశ్రమంలోనే వుండిపోయారు. కానీ, తరచు సమాధి దగ్గరకు వెళ్ళి వస్తూ వుండేవారు. ఒక ఆరు నెలలు గడిచిన తర్వాత, వారు కూడా శాశ్వతంగా సమాధి వద్దనే నివసించసాగారు. తర్వాత కాలంలో, "అక్కడ వుండాలనేది నా నిర్ణయం కాదు, భగవంతుడి నిర్ణయం" అనేవారు భగవాన్.

## 6. స్కూలు చదువు

కుంద్రాకుడి ఒక చిన్న గ్రామం. ఆ రోజుల్లో అక్కడ స్కూలు, విద్యా సదుపాయాలు వుండేవి కావు. అందువలన నేను చదువు నిమిత్తం దగ్గరలో వున్న తిరుపత్తూరుకు వెళ్ళవలసి వచ్చింది. అక్కడి స్థానిక దేవాలయంలో పిచ్చు అయ్యర్‌గారి సోదరుడు నిర్వహణాధికారిగా వుండేవారు. అక్కడి ప్రాథమిక పాఠశాలకు నేను రెండు సంవత్సరాలు వెళ్ళాను. ఇంతలో ఆయన పోయారు. దాని పక్క గ్రామమైన మానామధురై ప్రాథమిక పాఠశాలలో, నన్ను మూడవ తరగతిలో ప్రవేశపెట్టారు. అక్కడ పిచ్చు అయ్యర్‌గారి మరొక సోదరుడు శ్రీనివాసయ్యర్ నివసించేవారు. కొంతకాలానికి ఆయన తన కుటుంబాన్ని పసలై గ్రామానికి మార్చినపుడు, నేను మానామధురైలో నెల్లియప్పయ్యర్‌గారి కుమారుడు నాగు అయ్యర్‌గారింటికి మారాను. నేను అదే ఇంట్లో పుట్టాను. నేను ఆరవ తరగతి పాసయ్యాను. ఆ సమయానికి నాగు అయ్యర్‌గారు కూడా కాలం చేసారు. మా తండ్రిగారి స్నేహితుడైన వకీలు సుందరమయ్యర్‌గారు నాకు ఆశ్రయం ఇచ్చి నన్ను జాగ్రత్తగా చూసుకున్నారు. నా నాల్గవ ఫారమ్ (9వ తరగతి) ముగిసే వరకు ఓ.వి.ఎల్. హైస్కూలులో (ఒక్కూర్ వెల్లియార్ చెట్టియార్) వారి వద్దనే వున్నాను. నా స్కూలు విద్యాభ్యాసంలో అదే ఆఖరి సంవత్సరం.

1922 నుండి, ప్రతి సంవత్సరం శ్రీభగవాన్ జయంతికీ, అమ్మ అలఘమ్మాళ్ మహాపూజకు నన్ను తిరువణ్ణామలైకు తీసుకు వెళ్ళేవారు. 1928 డిసెంబరు 28వ తారీఖున తీయబడిన సామూహిక ఛాయా చిత్రంలో శ్రీభగవాన్ పక్కన, కావ్యకంఠ గణపతిముని వెనుకాల నిలబడి వున్న నన్ను చూడవచ్చు. నేనెంత అదృష్టవంతుడనో కదా!



## 7. శేషాద్రిస్వామి సమాధి

శ్రీ భగవాన్ సమకాలికులూ, గొప్ప తపస్వి అయిన శ్రీ శేషాద్రి స్వామిగారు 1929 జనవరి 14న మహానిర్వాణం చెందారు. శ్రీరమణాశ్రమానికి పక్కనే వున్న ఒక స్థలాన్ని వారి సమాధికోసం నిర్ణయించారు. ఆ పవిత్ర కార్యక్రమానికి నన్ను కూడా తీసుకు వెళ్ళి సందర్శించారు శ్రీ భగవాన్. శాస్త్ర ప్రకారం సమాధి స్థలంలో విభూతి, బిల్వ పత్రాలు, కర్పూరాదులు సమర్పించిన శ్రీ భగవాన్, నాతో కూడా వాటిని సమర్పింప చేసారు. ఒక మహాపురుషుని సమాధి కార్యక్రమంలో పాల్గొనగలిగినందుకు నాకు ఎంతో సంతృప్తి, ఆనందం కలిగాయి. అప్పటికి నాకు 15 సంవత్సరాల వయస్సు.

## 8. ప్రేమ (?) వివాహం

అదే సంవత్సరం మే నెలలో నాగలక్ష్మితో నా వివాహం జరిగింది. అప్పటికి ఆమెకు 13 ఏళ్ళు. ముద్దుగా 'నాగూ' అనేవారు. శ్రీభగవాన్ మేనమామగారైన పసలై రామచంద్రయ్యర్‌గారి మూడవ కుమార్తె వివాహాన్ని శ్రీభగవాన్ ఈ క్రింద వివరించిన విధంగా ఆమోదించి దీవించారు.

నా సొంత మేనమామ వేంకటరామయ్యర్‌గారు తన కుమార్తె లక్ష్మిని నాకిచ్చి పెళ్ళి చేయాలనుకున్నారు. నాగూతో నా పెళ్ళి నిశ్చయం గురించి మాటలు జరుగుతున్నాయని తెలిసి, పరుగు పరుగున 'సానూ' అత్తతో తిరువణ్ణామలై వచ్చి, లక్ష్మితో నా పెళ్ళి జరగటానికి వారి ఆశీస్సులు లభిస్తాయని ఆశపడి, శ్రీభగవాన్‌ను ఆశ్రయించారు. వారు చెప్పిన మాటలన్నీ మౌనంగా విని, చివరకు, "కానీ వెంకిటూను నాగూకి ఇచ్చి పెళ్ళి చేయాలని నిర్ణయించారు కదా?" అన్నారు. నాగూతో నా పెళ్ళికి ఇదే వారి పూర్తి ఆశీస్సు కదా!

శ్రీ గోపాలరావుగారిద్వారా వివాహానికి కావలసిన కొత్త ధోవతులు, చీర, ఇతర కానుకలు శ్రీ భగవాన్ ఆశీస్సులతో శ్రీరమణాశ్రమం నుండి దక్షిణ ప్రాంతంలోని వెట్టియూర్‌కి పంపబడ్డాయి. ఆ రోజుల్లో ఈ గ్రామం చేరటానికి రవాణా సౌకర్యాలు లేని కారణాన, గోపాలరావుగారు ఆ కానుకల మూటతో చాలా దూరం నడిచి రావలసి వచ్చింది.

నా పిల్లల బలవంతంతో ఇక్కడ పెళ్ళికి ముందు జరిగిన ఇంకొక సంఘటన తెలియపరుస్తున్నాను. కుంద్రాకుడిలో నాకు తెలిసిన ఒక రౌడీ వుండేవాడు. నల్లగా, తుమ్మమొద్దులాగా, గుండ్రంగా ఒక ఏనుగు పిల్లలాగ వుండేవాడు. నాగూకు, వీడితో పెళ్ళి మాటలు జరుగుతున్నాయని విని నాకు చాలా మనస్తాపం కలిగింది. నాగూ తెల్లగా, అందంగా, చలాకీగా వుండేది. తమిళంలో సామెత చెప్పినట్లుగా ఆ చిలకనిచ్చి ఒక అడవిజంతువుతో పెళ్ళి చేస్తారనే ఆలోచనను నేను భరించలేక పోయాను.

ఒకరోజు నేను బాగా కిక్కిరిసి వున్న బస్సులో వెళుతున్నాను. ఆ బస్సు మా మామగారి కంపెనీకి చెందినదే. యజమాని కుటుంబ సభ్యునిగా, నేను ఆ బస్సులలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేసేవాడిని. బస్సు డ్రైవరు, కండక్టరు నాకు ప్రత్యేకమైన గౌరవం ఇచ్చేవారు. స్త్రీలకు ప్రత్యేకింపబడిన చివరి వరుసలలో నాగలక్ష్మి ఒక్కతే, తన బంధువులు ఎవరూ లేకుండా, కూర్చుని వుండటం చూసాను. చక్కటి దుస్తులు ధరించి, మంచి రూపురేఖలతో ఎంతో ఆకర్షణీయంగా వుంది. వచ్చే మంచి ముహుర్తానికి ఆ సౌందర్యవతిని వికారమైన ఆ నల్లమొద్దుకి అప్పచెపుతారనే ఆలోచన, నన్ను ఆపాదమస్తకమూ వణికించి వేసింది. వచ్చే స్టాపులో దిగడానికి, ఆమె పక్కనున్న స్త్రీ లేచి నుంచుంది. నేను వెంటనే నాగూ పక్కకు వెళ్ళి "నీకిచ్చి పెళ్ళి చేద్దామను



కుంటున్న కుర్రవాడు నాకు తెలుసు. అసలు అతను నీకు తగనే తగడు. ఒక నల్ల గుమ్మడికాయలాగ వుంటాడు. అలాంటివాడిని నువ్వు చేసుకుంటావా? ఒక పని చేయి. ఇంటికి వెళ్ళగానే వాడిని చేసుకోను అని మీ అమ్మ దగ్గర గట్టిగా ఏడుపు లంకించుకో" అని నాగు చెవిలో గుసగుసగా చెప్పాను.

ఆమె ఇంటికి వెళ్ళి నేను చెప్పినట్లే చేసింది. ఆ అమాయకురాలు తాను ఎందుకు అతనిని పెళ్ళి చేసుకోవద్దనుకుందో వున్నది వున్నట్లు చెప్పి వేసింది. వాళ్ళమ్మ మాటమీద పెళ్ళి ఆగిపోయింది. కొన్ని రోజుల తర్వాత నేను వాళ్ళింటి ముందునుండి వెళుతూ వుంటే నాగూ తండ్రి రామచంద్రయ్యర్ గారు, నన్ను చూసి భగ్గుమని, గావుకేకలతో "దరిద్రుడా! నా కూతురు పెళ్ళి చెడగొట్టావు కదరా! నువ్వు నాశనమై పోవాలి!" అని శాపాలు పెట్టారు. నా తండ్రిగారు సన్యాసాశ్రమం స్వీకరించి సాధు జీవితం గడపడం వలన మా కుటుంబమంతా భిక్షకులే అన్నట్లు ఛీత్కారంగా చూసేవారు ఆయన. ఆయన నన్ను తిట్టినందు కంటె, పాపం నాగూ దుస్థితికి నేను చాలా విచారపడ్డాను. ఆమె వివాహాన్ని నేను ఆపివేసాను. పెళ్ళి ఆగిపోయిందనే మచ్చ, తర్వాత పెళ్ళి ప్రయత్నాలకు పెద్ద అడ్డుగోడలాగ తయారవుతుంది. ఇది నాకు చాలా బాధాకరమైంది.

కొన్నివారాల తర్వాత నాగూకు మళ్ళీ పెళ్ళి ప్రయత్నాలు జరుగుతున్నాయనీ, అవి ఫలించవచ్చుననీ తెలుసుకున్న నేను గొప్ప చింతలో పడిపోయాను. నా మామగారితోను, అత్తయ్యతోను "నేను పెళ్ళంటూ చేసుకుంటే నాగూనే చేసుకుంటాను. లేదా నేను బ్రహ్మచారిగానే వుండి పోతాను" అని ఖండితంగా చెప్పేసాను. నా మనస్సు మార్చాలని మామయ్య ఎంతో ప్రయత్నించారు. "మీ నాన్నంటే వారికి చాలా చిన్న

చూపు. నాగూను మరచిపో" అని చాలా చెప్పారు. నేను మాత్రం పట్టు విడువలేదు. "ఈ పెళ్ళి నువ్వు కుదిర్చేదాకా నేను తిండి తినను" అని పట్టుపట్టాను. నేనంటే అత్తకూ, మామయ్యకూ ప్రాణం. నా బెదిరింపు పనిచేసింది. మామయ్య రామచంద్రయ్యార్ దగ్గరకు పరుగున వెళ్ళి, ఏం చేసాడో తెలియదు కానీ, నాతో నాగూకు పెళ్ళికి అయ్యర్‌ను ఒప్పించాడు. నేను నాగూను ప్రేమించి పెళ్ళి చేసుకున్నానో, సానుభూతితో చేసుకున్నానో అన్న విషయం చదువరులే నిర్ణయించాలి. వాళ్ళమ్మ దగ్గర ఈ విషయాలన్నీ తెలుసుకున్న నా పిల్లలు నా ప్రేమ వివాహం గురించి, అవకాశం వచ్చినపుడల్లా నన్ను ఆట పట్టించేవారు.

## 9. నాగూకు లభించిన ఉపదేశం

మా పెళ్ళైన కొద్దికాలానికి అలమేలు అత్త, మామ పిచ్చయ్యార్ నాగూను శ్రీభగవాన్ దీవెనల కొరకు ఆశ్రమానికి తీసుకువెళ్ళారు. శ్రీభగవాన్ దర్శనం చేసుకున్న తర్వాత పాతహాలునుండి బయటకు వచ్చిన నాగూకు, మద్రాసు నుండి వచ్చి శ్రీ సి.వి. సుబ్రహ్మణ్యయ్యార్ దంపతులతోపాటు వచ్చిన వారి కుమార్తె మంగళం కనిపించింది. ఆమె కట్టుకున్న చీర నాగూకు బాగా నచ్చింది. "మీ చీర ఎంతో బాగుంది" అని ఆమెతో అన్నది నాగూ. ఈ మాట, ఆ అమ్మాయి తర్వాత తన తండ్రిగారితో చెప్పింది. మద్రాసు వెళ్ళిన తర్వాత, నాగూకు నచ్చిన ఆ చీరవంటివి రెండు కొని, నాగూకు ఇవ్వవలసిందిగా కోరుతూ ఆశ్రమానికి ఆయన పార్సెల్ పంపించారు.

ఆశ్రమానికి వచ్చిన ఉత్తరాలన్నీ విధిగా శ్రీభగవాన్ ముందు వుంచ బడతాయి. అలాగే ఈ పార్సెల్, దానితోపాటు వచ్చిన ఉత్తరమూ శ్రీభగవాన్ ముందు వుంచబడ్డాయి.

మరుసటి రోజు ఆశ్రమ వంటశాల వద్ద నాగూను చూసిన



శ్రీభగవాన్ "నాగూ! ఎవరైనా మంచి దుస్తులుగాని, నగలుగాని ధరించడం చూస్తే వాటిని నువ్వే ధరించినట్లుగా భావించాలి" అన్నారు. కళ్ళనిండా నీళ్ళు పెట్టుకొని వణుకుతున్న స్వరంతో, "భగవాన్! ఆ చీర కావాలని నేను అడగలేదు. బాగుందని మాత్రం అన్నాను" అన్నది. కానీ, శ్రీభగవాన్ తన ఉపదేశాన్ని మరోసారి చెప్పి, అక్కడనుంచి వెళ్ళిపోయారు.

ఆనాటి నుండి తను 55 ఏళ్ళ తర్వాత గతించేదాకా నాగూ ఎవ్వరి నుంచి ఏమీ అడగలేదు. శ్రీభగవాన్ దివ్యోపదేశంతో, సంతృప్తే సకల సంపదలూ అని గ్రహించుకొని జీవితం గడిపింది.

శ్రీభగవాన్ పలికిన ఆ ఒక్కమాట నాగూ తదుపరి జీవిత పథానికి నాంది అయింది. *(సశేషం)*

### అభ్యాసం

***ఆలోచనవలన విక్షేపం పొందినప్పుడెల్ల, ఆత్మలోకి ఉపరమించే ప్రయత్నం చెయ్యడం అభ్యాసం, అది మనస్సును ఏకాగ్రం చెయ్యడమూ కాదు. వినాశం పొందించడమూ కాదు. కేవలం ఆత్మోలోనికి ఉపరమించడం. తీవ్రంగా ఆలోచించగలిగితే మనస్సు చాలా బలంగా వున్నట్టు సామాన్యంగా అనుకుంటూ వుంటారు. కాని, జ్ఞాన సాధనలో ఏ ఆలోచనలూ లేకుండా ఉండగలిగినప్పుడే మనస్సు చాలా బలంగా ఉన్నట్టు. సాధకుడు తాను ఆత్మగా ఉండి పోవడం నేర్చుకోవాలి. అది చేతగానప్పుడు 'నేను' అనే దాని నిజతత్త్వం విచారం చేసుకుంటూ ఇతరాలోచనలు వచ్చినప్పుడెల్ల తిరిగి దానినే చిక్కబట్టుకుంటూ రావాలి. ఇదే అభ్యాసం.***

## *Tyaga* alone Bestows Immortality

Dr.K. Subrahmanian (Talk 89)

We are seeking something or the other, not just from others, but even from our own family and friends. We expect the wife and the children and our friends to behave in a particular way. Similarly, they expect us to behave in a particular way. And so, there are clashes, anger, disappointment and all these things. If there is no expectation of any kind whatsoever, the relationship will be extraordinary. Sometimes we tell our friends, "If you need anything, don't hesitate to ask me." So long as neither of them needs anything from the other, the friends get along. Sometimes what happens is that one person may need something, like say money, from the other and he is not able to spare it. The moment he says he is not in a position to give what was requested, we start feeling, "Oh! This person said he would help me, but now he is refusing to help; actually, he is not my friend."

This disappointment is a common thing. The relationship changes entirely when the other person says, "Sorry, I don't have what you are asking for." This is because our relationships are based on seeking. If there is no seeking of any kind from anybody, I will have no problems. People who may expect something from me may have problems, but as far as I am concerned, there is no problem because I say to myself, " I do my duty. I am not seeking anything more." The moment I develop such an attitude there will only be peace. When I realize that the Lord of the Universe



is within me, I don't have to go to anyone. He will guide me.

